ఘనంగా అహల్యాబాయి జయంతి ఉత్సవాలు



పుస్తక ఆవిష్కరణలో అతిథులు

కీసర: చీర్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో లోకమాత అహల్యాబాయి హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆమె జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించి, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్, పాఠశాల కోఆప్షన్ సభ్యులు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం



ఘట్‌కేసర్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు నగరంలోని వారి నివాసంలో గురువారం కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం పట్టణంలో రోడ్డు పనుల ప్రారంభానికి రావాలంటూ మంత్రికి ఆహ్వానం అందజేశారు. అలాగే మున్సిపల్ అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లేష్, కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగరాజ్ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

బోడుప్పల్: 1వ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ గురువారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో ఉన్న రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ. 2 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఇటీవల తీర్మానం చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

బోడుప్పల్: ప్రమాద రహిత సమాజం కోసం ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఎస్సై మల్లయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఏకాగ్రత, మానసిక ప్రశాంతతో విధులు నిర్వహిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. అసిస్టెంట్ మేనేజర్లు, సూపరింటెంట్ ట్రాఫిక్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వల..

చదువులు సాగేదెలా ?

- ప్రభుత్వ పాఠశాల్లో అసౌకర్యాలు
- సమస్యల ఒడిలో విద్యార్థుల చదువులు
- ఇరుకు గదుల్లో విద్యార్థుల అగచాట్లు
- ప్రభుత్వ స్థలం కేటాయించినా ఫలితం శూన్యం
- కొత్త భవన నిర్మాణానికి ఎదురుచూపులు





ప్రస్తుత ప్రభుత్వ పాఠశాల

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో గల ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు అసౌకర్యాల మధ్యనే తమ చదువులు కొనసాగించాల్సి వస్తోంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండు ఒకే చోట కొనసాగుతుండటంతో రెండు పాఠశాల్లో కలిపి సుమారు 600 నుంచి 800 వరకు విద్యార్థులు ఇక్కడే తమ చదువులను కొనసాగిస్తున్నారు. కేవలం 400 గజాల స్థలంలోనే రెండు పాఠశాలలు, 800 మంది విద్యార్థుల వరకు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం పాఠశాల ప్రారంభ సమయంలో అసెంబ్లీ (ప్రార్థన) చేయాలంటే ఒక పాఠశాల విద్యార్థులు తరగతి గదుల్లోనే ఉండి అసెంబ్లీ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఈ పాఠశాల ఆవరణలోనే రెండు పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండటం, వడ్డించడం కూడా చేయాల్సి వస్తోంది. ఇక విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో అసౌకర్యాల మధ్యనే ఏళ్ల తరబడి ఇక్కడి విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఇక విద్యార్థులు క్రీడలు ఆడాలంటే స్థలం లేక ఎక్కడ ఆడుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇంత ఇరుకు స్థలంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతుండడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, కొత్త భవనం నిర్మించాలని గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పలుమార్లు అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో అన్నీ వసతులతో ప్రభుత్వ స్కూల్ నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో సుమారు ఒక ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. పాఠశాల నిర్మాణం కోసం నిధులు కూడా మంజూరు చేస్తున్నట్లు గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన మల్లారెడ్డి కూడా తెలిపారు. ఇంతవరకు భాగానే ఉన్నప్పటికీ అధికారులు, పాలకులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడంతో దమ్మాయిగూడలో స్కూల్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న విధంగా తయ్యారయ్యింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం చేపట్టే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని ఇక్కడి ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



గతంలో ప్రభుత్వ స్కూల్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలం

మెట్రో ప్రకటనతో సంబరాలు



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి తదితరులు

మేడ్చల్: హైదరాబాద్‌కు ఉత్తరాన ఉన్న మేడ్చల్‌కు నగరంలోని ప్యారడైజ్ నుంచి కండ్లకోయ రింగురోడ్డు జంక్షన్ మీదుగా మేడ్చల్ వరకు మెట్రో రైల్ ఏర్పాటు చేసేందుకు డీపీఆర్ తయారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో మేడ్చల్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టాపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మేడ్చల్‌కు మెట్రోను తేవడం వల్ల మేడ్చల్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, రమేష్, నాయకులు మల్లేష్‌గౌడ్, నరేందర్, దేవ, రాఘవేందర్‌గౌడ్, సురేందర్ ముదిరాజ్, మధుకర్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు





సీఎంను కలిసిన డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి , కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్

మేడ్చల్: మెట్రో ఫేజ్–2 మేడ్చల్ నియోజకవర్గంలోని మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో సేవలు విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసి డీపీఆర్ సిద్ధం చేయాలని ప్రకటించడంతో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అగ్ర నాయకులు సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ సీఎం రేవంత్‌ను కలిసి సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు మెట్రో వస్తుండటంతో మేడ్చల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని నాయకులు అన్నారు.

శుభాకాంక్షలు



మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కలిసి గురువారం న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి చాంబర్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహేష్, డీఈ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



కీసర: మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని గురువారం రాంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు కొండేటి లతానర్సింహారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కీసరలో..

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

పశువులను తరలిస్తున్న వాహనం పై దాడి



ఘట్‌కేసర్: పశువులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డగించి దాడి చేసిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పురకు చెందిన మహ్మద్ ఉమెర్ (30), డ్రైవర్ సల్మాన్‌తో కలిసి బీబీనగర్ మండలం కొండమడుగులో బుధవారం వారం సంతలో పశువులు కొనుగోలు చేసి అశోక్‌లీలాండ్ వాహనంలో అంబర్‌పేట్‌కు తరలిస్తున్నాడు. ఘట్‌కేసర్ అండర్ పాస్ రోడ్డు సమీపంలో గోరక్షక్‌దళ్ సభ్యులు పవన్‌రెడ్డి, పవన్, వినయ్, దీపక్‌సింగ్ తదితరులు వాహనం అడ్డగించి పశువులను చూపించాలని కోరడంతో వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో లారీ డ్రైవర్ సల్మాన్ వాహనం తీసుకొని వెళ్లిపోగా.. వాహనం దిగిన ఉమెర్‌పై దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

పీఎస్ దగ్గర ఉద్రిక్తత..

దాడి విషయం తెలుసుకున్న ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ ఖాద్రీ, కార్పొరేటర్లు, అనుచరులతో అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి తన అనుచరులతో అర్ధరాత్రి పీఎస్‌కు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఎంఐఎం నాయకులు డిమాండ్ చేశారు. పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పీఎస్‌కు చేరుకొని నాయకులను సముదాయించి పంపించి వేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసుగా నమోదు చేశారు. ఈ ఘటనలో నిందితుడు వినయ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించగా, మిగిలిన ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పశువులు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారా? లేదా అన్న సమాచారం తెలియాల్సి ఉంది.

నేడు సీజ్ చేసిన వాహనాలు వేలం

పోచారం: ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన వాహనాలను గురువారం ఉదయం 11 గంటలకు 8 వాహనాలను వేలం వేస్తున్నట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జూపల్లి రాజు తెలిపారు. వేలం పాటను నారపల్లిలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8712658736 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

తల్లి, పిల్లలు అదృశ్యం



జ్యోతి (ఫైల్)



జశ్వంత్, యశ్వంత్ (ఫైల్)

జవహర్‌నగర్: భార్యభర్తల మధ్య గొడవ కారణంగా మనస్థాపం చెందిన భార్య పిల్లలతో సహా అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ చంద్రపురి కాలనీలో సబావత్ రాజు, భార్య జ్యోతి (29), ఇద్దరు కుమారుడు జశ్వంత్ (10), యశ్వంత్ (8)తో కలిసి నివసిస్తున్నారు. డిసెంబర్ 31న భార్యభర్తలు మధ్య పలు ఆర్థిక విషయాల వల్ల గొడవ జరిగింది. రాజు పని నిమిత్తం బయటకు వెళ్లగా జ్యోతి తన పిల్లలతో సహా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. రాజు తన పని అయిపోయాక తిరిగి ఇంటికి వచ్చి చూడగా భార్యపిల్లలు కనిపించలేదు. ఈ నేపథ్యంలో వారి కోసం తెలిసిన చోట్ల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ సిబ్బందికి దుప్పట్ల పంపిణీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈస్ట్ గాంధినగర్‌లో గల కల్వరి గ్రేస్ చర్చి నిర్వాహకులు గాబ్రియల్ ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్‌వర్క్స్, వీధిలైట్ల నిర్వాహణ సిబ్బంది సేవలను అభినందిస్తూ స్థానిక 15వ వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈస్ట్‌గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.



కీసరలో..



మేడ్చల్‌రూరల్‌లో.. స్వెటర్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

కాలేజీ సెక్యూరిటీ గార్డుపై దాడి

శామీర్‌పేట్: కాలేజీ సెక్యూరిటీ గార్డుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీలోని విశ్వవిశ్వాని కళాశాలలో షేక్ షరీఫ్ (32) సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. జనవరి 1న నలుగురు వ్యక్తులు వచ్చి కాలేజీ గేటు తెరవాలని కోరగా సమయం ముగిసిందని గేటు తెరవలేమని బదులిచ్చాడు. దీంతో ఆ వ్యక్తులు సెక్యూరిటీ గార్డుపై కర్రలతో దాడి చేసి, కారు తాళంతో కడుపులో పొడిచి పరారయ్యారు. అది గమనించిన స్థానికులు షరీఫ్‌ను హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ దాడికి పాల్పడింది విశ్వవిశ్వాని కళాశాలలో చదివే విద్యార్థులేనని, వారి పేర్లు బయటపడితే కళాశాల పేరు చెడిపోతుందనే ఉద్దేశ్యంతో గోప్యంగా ఉంచడానికి శతవిధాల ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

చికిత్స పొందుతూ యువతి మృతి

పోచారం: బాల్కానీ నుంచి కిందపడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలంలోని మేడిపల్లికి చెందిన చంద్రశేఖర్ తన భార్య, కుమార్తె, కుమారుడుతో కలిసి పోచారంలోని లక్ష్మారెడ్డి రెసిడెన్సీలో నివసిస్తున్నాడు. డిసెంబర్ 31 రాత్రి అందరూ కలిసి నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం 7 గంటల సమయంలో పెద్ద శబ్దం రావడంతో చంద్రశేఖర్, అతని భార్య బాల్కానీ వద్దకు వచ్చారు. వీరి కుమార్తె శ్రీజ (16) బాల్కానీ నుంచి కింద పడిపోవడం చూశారు. వెంటనే శ్రీజను చికిత్స కోసం మేడిపల్లిలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శ్రీజ మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌కార్డులో ఎక్కని పేర్లు !

- ఐదేళ్లుగా మ్యుటేషన్లకు దిక్కే లేని పరిస్థితి
- పెండింగ్‌లో మ్యుటేషన్ల దరఖాస్తులు 86,885
- గత సర్కారు హయాంలో 90 వేల రేషన్ కార్డులు రద్దు
- కొత్త కార్డుల కోసం 1.89 లక్షల దరఖాస్తులు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ఉప్పల్‌లో నివసిస్తున్న దేవేందర్ నాలుగేళ్ల కిందట తన పాప పేరు రేషన్ కార్డులో చేర్చాలని మీ–సేవలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం తన రెండో బాబు వివరాల నమోదు కోసం మీ–సేవ కేంద్రానికి వెళ్లారు. పాతది పెండింగ్‌లో ఉన్నందున ఈ వివరాలు నమోదు చేస్తే దరఖాస్తు తీసుకోవడం లేదు. ఈ పరిస్థితి ఒక మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే కాదు.. అంతటా నెలకొని ఉంది. ఐదేళ్లుగా మీ–సేవ కేంద్రంలో రెండో బిడ్డ వివరాలు చేర్చేందుకు అవకాశం లేకుండా పోయింది. కనీసం దరఖాస్తు చేసుకోవటానికి కూడా వీల్లేకుండా పోయింది.

చేర్పుల పెండింగ్ దరఖాస్తులు 86 వేలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తమ పిల్లల పేర్లను ఆహార భద్రత కార్డులో నమోదు చేసుకునేందుకు మీ–సేవ కేంద్రాల్లో 86,885 మంది దరఖాస్తు చేసుకోగా, ఐదేళ్లుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇందులో బాలానగర్–1లో 35,735 దరఖాస్తులు ఉండగా, బాచుపల్లిలో 1260, గండిమైసమ్మ దుండిగల్‌లో 2,669, ఘట్కేసర్‌లో 2,731, కాప్రాలో 3,688, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,657, మేడిపల్లిలో 3,169, ఉప్పల్–2లో 29,264, శామీర్‌పేట మండలంలో 2,324 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు సైతం శూన్యంగానే ఉన్నాయి.



లక్షకు పైగా దాటేవి..

గత పదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఆహారభద్రత కార్డులు జారీ చేసింది. తర్వాత రెండు సార్లు కొత్త కార్డులు జారీ చేసి చేతులు దులుపుకుంది. సభ్యుల వివరాలు కార్డుల్లో చేర్పించేందుకు అవకాశం కల్పించలేదు. కానీ, పేర్లను చేర్చేందుకు మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు ఇప్పటికీ కార్డుల్లోకి ఎక్కలేదు. వారికి రెండో సంతానం పుట్టగా.. నమోదు చేసుకునేందుకు మీ–సేవ కేంద్రాలకు వెళ్తే మొదటి దరఖాస్తే పెండింగ్‌లో ఉన్నందున రెండోది తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇలాంటి వారికి అవకాశమిస్తే దరఖాస్తులు లక్షకు పైగా చేరేవని జిల్లా పౌరసరఫరాల శాఖ పేర్కొంటున్నాయి.

గత సర్కారు హయాంలో రద్దు అయిన కార్డులు 90 వేలు

మేడ్చల్ జిల్లాలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ (ఆహార భద్రత) కార్డులను మంజూరు కాకపోగా, 2016లో ఉన్న రేషన్ కార్డుల నుంచి 90,040 రేషన్ కార్డులను రద్దు చేసింది. రేషన్ కార్డుల రద్దుకు అప్పట్లో చూపిన కారణాల్లో ప్రధానంగా ఉపాధి కోసం ప్రజలు వలస వెళ్లటం.. కుటుంబంలో ఆడపిల్ల వివాహం తర్వాత ఆమె పేరు తొలగించకపోవటం.. మృతిచెందిన వారి పేర్లు కూడా తీసివేయకపోవటం వంటివి పేర్కొంది. ఈ కారణాల నేపథ్యంలోనే 2016లో అప్పటి సర్కారు ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ 90,040 రేషన్ కార్డులు రద్దు చేసింది. దీంతో నిరుపేద లబ్ధిదారులు ఏళ్ల తరబడి రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై అప్పటి ప్రభుత్వం స్పందించకపోవటంతో కొందరు లబ్ధిదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, మరోసారి పరిశీలించాలని సూచనలిచ్చింది. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రేషన్‌కార్డుల పునరుద్ధరణకు సర్వే ప్రక్రియ చేపట్టినప్పటికీనీ పూర్తి చేయలేకపోయింది.

కార్డుల కోసం 1.89 లక్షల దరఖాస్తులు

రాష్ట్ర ఆవిర్భావం నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదు. 2025 సంక్రాంతి నుంచి కార్డులను జారీ చేయనున్నట్లు సర్కారు ఇటీవల ప్రకటించటంతో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారితోపాటు కొత్తగా అర్జీలు పెట్టుకునేవారూ ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం కాంగ్రెస్ సర్కారు దరఖాస్తులు స్వీకరించగా, 1.89 లక్షల అర్జీలు పౌరసరఫరాలశాఖకు చేరాయి. తాజాగా సంక్రాంతి నుంచి కొత్త కార్డులను జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించటంతో మరోసారి అర్జీలు స్వీకరించనుండటంతో సంఖ్య పెరిగే అవకాశముంది. మేడ్చల్ జిల్లాలో ప్రస్తుతం 5,32,938 రేషన్‌కార్డులు ఉండగా, 17,18,351 మంది లబ్ధిదారులు ఉన్నారు.

రద్దు అయిన కార్డులిక్కడే

మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 95,040 తెల్ల రేషన్ కార్డులు రద్దు కాగా, మండలాలు, జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల వారీగా రద్దయిన తెల్ల రేషన్‌కార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. బాచుపల్లి మండలంలో 2,378 తెల్లరేషన్ కార్డులు రద్దు కాగా, ఘట్కేసర్‌లో 2,273, కాప్రాలో 2,263, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,306, మేడిపల్లిలో 4,165, శామీర్‌పేట్‌లో 893, మూడుచింతలపల్లి మండలంలో 328 రేషన్ కార్డులు రద్దు అయ్యాయి. ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 39,270, బాలానగర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 35,210 తెల్ల రేషన్ కార్డులు రద్దయ్యాయి.